# అక్షింతలు

### శ్రీరమణ

బాల భానుని లేత కిరణాలు అరుణారుణంగా కాఫీ కప్పుమీద పడి, వింత కాంతులు వెదజల్లుతున్నాయి. ప్రకృతి శోభనీ, కాఫీనీ కలిపి ఆస్వాదిస్తున్న సమయంలో వామనరావు ఆదుర్దాగా వచ్చాడు. అతని ముఖంలో ఆత్రుత, ఆందోళన-ఏదో పోగొట్టుకున్న వాడిలా కన్పించాడు.

"ఏమిటేమిటని" అతని ఆదుర్దా గమనించి అడిగాను.

"హృదయాల మీది పెంకులు పగిలిపోతున్నాయి-బైట వినబడుతున్నాయి-ఇట్లారండి రోడ్డుమీదికి." అన్నాడు వామనరావు కొంచెం గంభీరంగా-

"మళ్ళీ ఇంటివాడితోగాని, ఇంటావిడతోగాని పేచీ వచ్చిందా?" అని అడిగాను పెంకులు పగిలిపోతున్నాయి అనే ఫ్రేజ్ వినగానే-

"అబ్బే! అదేంకాదు—"

"మరి?"

"మనం కూడా అర్జంటుగా సొంత దస్తూరితో, సొంత గొంతుకతో మన పొయిట్రి వేయించాలి-తప్పదు" అన్నాడు వామనరావు దృఢంగా.

అసలు నేను వూహించినదానికీ. వామనరావు చెప్పిన దానికీ ఏమాత్రం పొంతన లేకపోవడంతో ఓ క్షణంసేపు ఆలోచనా రహితంగా వుండిపోయాను.

"దానికి చాలా అవుతుంది. మనం 'అచ్చు'కో గలమంటావా" అన్నాను నైరాశ్యపు వాయిస్‌తో

"ఏం పర్వాలేదు గాని ఇంతకీ ఫారెన్‌లో నీకెవరైనా స్నేహితులున్నారా?" నా కళ్లలోకి ఆశగా చూస్తూ అడిగాడు కవి-వామనరావు.

"వున్నారు. కాని వున్న యిద్దర్లో ఒకడు సైంటిస్టు. రెండోవాడు సైకియాట్రిస్టు-బొత్తిగా టేస్ట్ లేనివాళ్లు " అన్నాను తప్పించుకునే వైఖరిలో.

"వాళ్లు మనకేం చెయ్యక్కర్లేదు బ్రదర్ డబ్బు మనమే పెడతాం-ప్రింటింగూ గట్రా అక్కడ చేయిస్తే చాలు-అదీ కష్టమనుకుంటే కవర్ పేజీ వరకూ అయినా " వామనరావులో ఇందాకటి

పుత్సాహం తగ్గినట్టు కన్పించింది. నా జవాబు కోసం ఆశగా ఎదురు చూస్తున్న కవిని ఎలా సముదాయించాలో నాకు తోచడంలేదు. కానేపు ఆ లో చిం చి "చూడండి-ఇప్పుడు మనం ఎన్నిచేసినా- ఎలా చేసినా - ప్రపంచసాహిత్యంలో యిది తొట్టతొలి ప్రయత్నం అనే కీర్తి బస్సుని ఎలాగూ మిస్ అయాం-కనుక మీకీ మంకు పట్టు తగదు" అని నిష్కర్షగా చెప్పాను.

"మరైతే ఇంకా ఎట్లా చేస్తే తెలుగు వాళ్లంతా దంగై పోతారో చెప్పండి. పోనీ అలాగే చేద్దాం" వామనరావు ఆశగా అడిగాడు.

"సొంత దస్తూరి, సొంత గొంతుతో బాటు కవిగారు వాడిన పైపు కూడా యిస్తే " అన్నాను.

"బానే వుంటుంది. లోగడ ఎవరూ యిలాంటి ప్రయోగం చేసినట్టు లేదు. కాని మనకి పైపు అలవాటులేదే " కొంచెం బాధగానూ, గిల్టీగానూ అన్నాడు వామనరావు.

"అదేముంది లెండి అలవాటు చేసుకో వచ్చు-పెద్ద శ్రమేంకాదు-వెరీ యీజీ" అని హామీ యిచ్చాను.

"అంటే - ఇప్పుడు మనం వెయ్యి కాపీలు వేస్తే, వెయ్యి పైపులు కావాలన్న మాట"

"అంతేకదా-అయినా దాందేముంది లెండి- శబరిలాగా ప్రతిపైపూ ఓసారి ఎంగిలిచేస్తే చాలు-బ్రాండ్ న్యూ యిస్తే మీ అభిమానులకు సంతృప్తి వుండక పోవచ్చు ."

నా మాటలకి వామనరావు కొంచెం సిగ్గుపడ్డట్టున్నాడు. ఓక్షణం మౌనం వహించాడు. ఈ క్షణంలోనే వామన రావుని క్లుప్తంగా మీకు పరిచయం చేస్తాను. తర్వాత మళ్ళీ టైం దొరక్క పోవచ్చు.

వామనరావు పొడుగ్గానే వుంటాడు. తొలి రోజుల్లో పార్ట్ టైం పొయెట్. క్రమేపీ ఫుల్ టైమర్‌గా మారిపోయాడు. ఇంట్లోగాని, బయటగాని, కవిత్వంలో గాని కమిట్‌మెంట్స్ ఏమీ లేవు. శ్రమ పడి రాస్తాడు. శ్రమపెట్టి విన్పిస్తాడు. కవి అనేవాడు పొరుగువాడి బాధల్ని, సుఖాల్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని తనవిగా చేసుకుని, వాటిని కవనంలో చొప్పించాలనే మతం అతనిది. ఆ మతంలో చేరినప్పటి నుంచి "నేను" అనడానికి బదులు "మనం" అంటుంటాడు. వామనరావు కవిత్వపు అందచందాలు, లోతులు, వెడల్పులు నాకు అంతగా తెలియవు. ప్రతి పంక్తి లోనూ చివరి రెండు మూడు అక్షరాలు ఒకలాగే ధ్వనిస్తాయి. ఆ "ధ్వని" అప్పుడప్పుడు వినడానికి బాగుంటుంది. అంతకు మించి నాకేమీ తెలియదు

వామనరావు సిగ్గునుంచి తేరుకుని "ఇంకా ఏమైనా కొత్త ఐడియా ?" అన్నాడు

"ఏం లేదండీ-పాఠకులకి మీ జ్ఞాప కార్థం ఏదో వొకటి యివ్వడం ముఖ్యం. కాపీకో కలం యివ్వచ్చు. గొప్ప గొప్ప ఆలోచనలను ప్రజలకు అందిస్తున్న మీ మెదడు మీది కెశాలు రెండేసి చొప్పున యిచ్చినా ?"

నా మాటకి బట్టతల ఒక్కసారి




నిమురుకున్నాడు గర్వంగా వామనరావు.

"ఇంతకు ముందు ఎవరూ యీ ప్రయోగం చెయ్యలేదుకదా!"

"ఉహు" అని తలవూపాను. ప్రయోగం కాదు నిజానికి యిది సాహసం. అయితే ఆ ముక్క ఆయనతో అనలేదు.

"జనం రిసీవ్ చేసుకుంటారంటారా?"

"పుస్తకంతో వుచితంగా యిస్తుంటే, తీసుకోక తప్పేదేముంది వాళ్ళకి "మీ ఫాన్స్ చాలా సంతోషిస్తారు కూడా" అన్నాను ఆలోచనని బలపరుస్తూ—

వామనరావు మనసు కుదుట పడ్డట్టుంది. విలాసంగా నవ్వి లాల్చీ జేబు లోకి చెయ్యి పోనిచ్చాడు-నాకు భయం అందుకుంది. కవులు జేబులో చెయ్యి పెడితే సర్వసాధారణంగా కరెన్సీ మడత రాదు. కవిత్వపు మడతే వస్తుంది-నేను ఆయన వాలకం గ్రహించి "ఆఫీసు టైం అవుతోంది" అని సణిగాను-

వామనర్రావు నావంక చూసి కళ్ళ లోనే నవ్వారు. ఆ నవ్వులో విలనత్వం తొంగి చూసింది. "నిన్ను చస్తే వదలను" అని శపథం చేస్తున్నట్టుంది ఆ చూపు.

"చూశారా? కవిత్వమే వూపిరిగా జీవించే మనలాంటి వాళ్ళకి ఏం చేద్దామన్నా, ఏం రాద్దామన్నా కవిత్వమే వస్తుంది. ఎందుకు చెప్పొచ్చానంటే పొద్దున మా యింట్లో గుడ్డల పద్దు రాశాను-వినండి అంటూ చీటీ మడత విప్పాడు. నాగుండె గుభేలుమంది-

" గళ్ళలుంగీ ఒకటి
సిల్కు లాల్చీలేడు-ఈ పంక్తులు
రిపీట్ చేశాడు.

చోళీలు చొక్కాలు
ఆరేసి ఆరేసి-ఇక్కడ మనం
శ్లేష గ్రహించవలె.
పంచెలా-అవి-ఐదు
చీరెలేమో సెవెను-నావంక చూశాడు.
అభిప్రాయంకోసం
అయి వుండవచ్చు.

చెడ్డీలు, బాడీలు
చెరి మూడు మూడు.

పద్దుశేవైనా అంతే-మరి మన కొంపలో మా ఇంటావిడ కూరల జాబితా యిచ్చింది చూడండి - ఇంకో మడత విప్పాడు వామనరావు. ప్రాణం వుగ్గ

వట్టుకు కూచున్నాను. సావానదోషంగా ఆవిడకి పొయిట్రీ అబ్బిందన్నమాట!

వంకాయలు
బెంకాయలు
తోటకూర
కొత్తిమీర
ధరసుబట్టి
పనసపొట్టు
మర్చిపోకు
కర్వేపాకు
దగా దగా
రేటు దగా
సరుకు దగా
రాళ్లు దగా
తస్మాత్! జాగ్రత్త సుమా?

తన్మయుడై చరణాలను పునశ్చరణ చేస్తూ చదివి విన్పించాడు వామనరావు. మడత భద్రంగా జేబులో పెట్టుకుంటూ, కళ్లు వత్తుకున్నాడు వామనరావు. నాకు తొందరగా అయిపోయిందన్న సంతోషం తప్ప ఏ ఫీలింగూ కలగలేదు. కవి నిష్క్రమించాడు. ఆరోజుకి గండం గట్టెక్కింది. వెడతూ వెడుతూ నాకు మరోసారి జ్ఞప్తి చేస్తూ-"ఏమైనా సరే కొత్తఐడియా-మన పొయిట్రీ శాశ్వతంగా వుండేలా ఆలోచించు బ్రదర్" అన్నాడు.

నాలుగురోజుల తర్వాత ఇంకో పెద్ద మనిషిని వెంటపెట్టుకుని వచ్చాడు వామనరావు. నూతనోత్సాహంతో అతని ముఖం వెలిగిపోతోంది.

"నాల్రోజుల్లో మన పని ప్రారంభం అవుతోంది బ్రదర్" అన్నాడు వస్తూనే.

"ఇండియాలోనే వేస్తున్నారా?" అన్నాను.

"లేదు. ఆలోచనే మారింది. మన పొయిట్రీని రాళ్ళమీద చెక్కించడానికి నిర్ణయం జరిగింది. వీరు క్వారీ కంట్రాక్టర్‌గారు" అంటూ పక్కనవున్న పెద్ద మనిషిని పరిచయం చేశాడు.

"బండలమీద చెక్కిస్తే బానే వుంటుంది గానీ, పాఠకులకి దాచుకోడానికి కష్టం అవుతుందేమో" అన్నాను సందేహంగా.

"పాఠకులకి విడి ప్రతుల సమస్యే లేదు మన వూరి కొండమీద చెక్కిం చేస్తున్నాను-ఈ మట్టి, ఈ అడివి, ఈ కొండ, ఈ నీరు ఈ గాలి సమస్తం ప్రజలవి. మన కవిత్వమూ అంతే. ప్రజకి అంకితం చేస్తున్నాను. మన అక్షరం శిలాక్షరం అవుతుంది. మన గొంతు కొండల్లో ప్రతిధ్వనిస్తుంది" వామనరావు గంభీరంగా అన్నాడు.

"మీ ఆలోచనకి జోహార్లు. అయితే గుడ్డల పద్దులు, కూరల లిస్టులూ మరీ వ్యక్తిగతంగా వున్నవి యిలా చెక్కిస్తే బావుండదేమో" అన్నాను

క్వారీ కంట్రాక్టర్ నన్ను గుర్రుగా చూశాడు - బిజినెస్‌కి అడ్డువస్తున్నానని. వామనరావు తీవ్రంగా నావంక చూసి "మన కవిత్వం మీరు విన్నది కొద్ది. నేను రాసిందంతా ప్రజలకోసమే రాశాను-నేను ఏం చేసినా ప్రజలకోసమే చేశాను నన్ను శంకిస్తే మార్క్సుని శంకించినట్టే! ఆ సరస్వతీ దేవి మీద ప్రమాణంచేసి చెబుతున్నా-నేను కమిటెడ్ రైటర్ని" అంటూ వామనరావు విసవిసా వెళ్లిపోయాడు. కంట్రాక్టర్ అతన్ని అనుసరించాడు.